4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 17 అక్టోబర్ 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# అదానీకి ఎదురుదెబ్బ

**ప్రధాని** నరేంద్ర మోదీ పాలనలో దేశంలోనే అగ్రస్థాయి వాణిజ్యవేత్తగా ఎదిగిన గౌతమ్ అదానీ విదేశీ విస్తరణ ప్రణాళికకు బ్రేకు పడింది. కెన్యాలో ఆయన దక్కించుకోవాలనుకున్న అంతర్జాతీయ విమానాశ్రయం కాంట్రాక్టు చిక్కుల్లో పడింది. రాజధాని నైరోబీలోని జోమో కెన్యాటా ఎయిర్ పోర్టు నిర్వహణను అదానీ కంపెనీకి 30 ఏండ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు అక్కడి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. తన ప్రియమిత్రునికి ఈ ప్రాజెక్టును ఇప్పించేందుకు ప్రధాని మోదీ తెరవెనుక పావులు కదిపారనే వార్తలు ఇదివరకే గుప్పుమన్నాయి. ఒప్పందంపై సంతకాలు పెట్టే సమయం దగ్గరవుతున్న కొద్దీ ప్రాజెక్టు చుట్టూ వివాదాలు ముసురుకున్నాయి. ఒప్పంద అంశాల రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ కెన్యా మానవ హక్కుల కమిషన్, కెన్యా న్యాయవాద సంఘం కేసులు వేయడంతో తదుపరి నిర్ణయం వరకు అదానీ ప్రతిపాదనపై కోర్టు స్టే విధించింది. సెనేట్ విచారణలోనూ కెన్యా ప్రభుత్వం తీవ్ర విమర్శలకు గురైంది. గత నెల నిరసన ప్రదర్శనలు జరిపిన విమానాశ్రయ సిబ్బంది ఇటీవలే సమ్మెకు దిగి విమానాల రాకపోకలకు అంతరాయం కలిగించడం గమనిస్తే ప్రాజెక్టుపై వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. దేశవ్యాప్త నిరసనల మధ్య కెన్యా ప్రభుత్వం అదానీ ప్రాజెక్టు విషయంలో వెనుకకు తగ్గడం ఒక ఎత్తయితే మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచీ అదానీ కంపెనీలను ప్రోత్సహిస్తున్నారని కెన్యా మాజీ ప్రధాని ఓడింగా వెల్లడించడం ఒక ఎత్తు.

ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతున్న కెన్యా అధ్యక్షుడు విలియం రూటో ప్రభుత్వానికి అదానీ వ్యవహారం గుదిబండగా మారింది. ఇటీవలే ఎయిర్‌పోర్టు ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను సామాజిక కార్యకర్త నెల్సన్ అమెన్యా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో బయటపెట్టినప్పటి నుంచి రాజకీయ దుమారం రేగింది. అనేక ఇతర కంపెనీలు ప్రతిపాదనలు పంపినా కెన్యా ప్రభుత్వం పట్టించుకోలేదని, అదానీ కంపెనీని ఏరి కోరి ఎంపిక చేసిందనే సంగతి తేటతెల్లమైంది. అంతర్జాతీయ టెండర్లు పిలవకుండా, లోపల్లోపల బంగారు బాతులాంటి ఎయిర్ పోర్టును అదానీ పరం చేయడంపై గగ్గోలు బయల్దేరింది. అదానీ డిమాండ్లకు తలొగ్గాల్సిన అవసరం లేదని, ఎయిర్ పోర్టుకు అవసరమైన పెట్టుబడిని కెన్యా సొంతంగా సేకరించుకోవచ్చని పలువురు ప్రజా ప్రతినిధులు కెన్యా ప్రభుత్వానికి సూచించడం గమనార్హం.

దేశంలోని వాణిజ్యవేత్తలను లేదా కంపెనీలను సమదృష్టితో చూడాలి. కానీ, గత పదేండ్లుగా దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలిస్తున్న ప్రధాని మోదీ తన మిత్రుడు అదానీని కొంచెం ఎక్కువ సమదృష్టితో చూస్తున్నారనేది బహిరంగ రహస్యమే. భారత భూభాగం మీదే కాదు, విదేశాల్లోనూ అదానీకి కాంట్రాక్టులు ఇప్పించేందుకు మోదీ ఉత్సాహం చూపుతుంటారు. అయితే, విదేశీ కాంట్రాక్టులు ఇప్పించడం, మెప్పించడమనేది అంత తేలిక కాదు. గతంలో శ్రీలంకలో విద్యుత్తు ప్రాజెక్టు విషయంలో అదానీ కంపెనీ విమర్శల పాలైంది. ఇప్పుడు కెన్యా విషయంలో జరిగినట్టుగానే అప్పుడూ ప్రధాని మోదీ అదానీ తరఫున ఒత్తిడి తెచ్చినట్టు శ్రీలంక నేతలు ఆరోపించడం తెలిసిందే. అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేసిన హిండెన్‌బర్గ్ సంస్థ గ్రూప్‌పై స్విట్జర్లాండ్‌లో మనీలాడరింగ్ కేసులు దాఖలైనట్టు వెల్లడించడం ప్రకంపనలు సృష్టిస్తున్నది. అటు అమెరికాలో ముడుపుల ఆరోపణలు నమోదైనట్టు బ్లూంబెర్గ్ వెల్లడించింది. అయితే, ఈ ఆరోపణలన్నిటిని అదానీ గ్రూపు ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉన్నది. ఈ వివాదాలు ఆయా అంశాలకే పరిమితం కావు. దేశాలతో మైత్రిపై వాటి ప్రభావం ఉంటుందని గుర్తుంచుకోవాలి. కెన్యాలో అదానీ ప్రాజెక్టులపై వ్యక్తమవుతున్న నిరసనలు కాలక్రమంలో భారత వ్యతిరేకతగా పరిణమించే ప్రమాదమున్నదనే హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక వాణిజ్యవేత్తపై పాలకుల మమకారం విదేశాలతో సంబంధాలు దెబ్బతినడానికి కారణం కావడం ఏ మాత్రం వాంఛనీయం కాదు.

# లెక్క తేలుస్తారు సరే, మరి వాటా?

కులం గురించిన చర్చ ఈ రోజు కొత్తగా జరుగుతున్నది కాదు. కానీ, ఈ చర్చ వచ్చిన ప్రతీసారి కొన్ని కొత్త సమస్యలు తెరపైకి వస్తున్నాయి. మరిన్ని కొత్త చర్చలు తెర మీదకొస్తున్నాయి. ప్రస్తుతం మన రాష్ట్ర ప్రభుత్వం చేయాలనుకుంటున్న బీసీ కులగణనకు సంబంధించిన చర్చ కూడా పలు ఆలోచనలకు తావిస్తున్నది. గత అనుభవాలే దీనికి మూల కారణం.



**అస్కాని మారుతీసాగర్**
90107 56666



**కు**లం ఆధారంగానే మన దేశ సామాజిక వ్యవస్థ నిర్మాణం జరిగింది. ఇప్పటికీ అదే కొనసాగుతున్నది. కొందరు నాయకులు మినహాయిస్తే కులం విషయంలో అందరూ ఆ తాను ముక్కలే. ఎన్నికలు వచ్చాయంటే చాలు, బీసీల మీద అన్ని పార్టీలకు వల్లమాలిన ప్రేమ పుట్టుకొస్తుంది. గత ఎన్నికలకు ముందు భారత్ జోడోయాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేసి రిజర్వేషన్లు వర్తింపజేస్తామని బాహాటంగానే ప్రకటించారు. ఇక్కడ జరిగిన కామారెడ్డి డిక్లరేషన్‌లో ఈ విషయంపై మరింత స్పష్టత ఇచ్చారు. 42 శాతం రిజర్వేషన్ కూడా కల్పిస్తామని చెప్పారు. దానికి కొనసాగింపుగానే కావచ్చు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కులగణన చేయాలని 2024, అక్టోబర్ 11 నాడు జీవో నెంబర్ 18 విడుదల చేసింది. 60 రోజుల్లో కులగణనను పూర్తిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా బీసీ కమిషన్‌కు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో ఉన్న దాదాపు 134 బీసీ కులాలకు సంబంధించి జనాభా లెక్కలు తేల్చే వ్యవహారం కొలిక్కి వచ్చినందుకు బీసీ సంఘాలు నిజంగానే తెగ సంబురపడిపోతున్నాయి. ఇందుకు చొరవ తీసుకున్న ప్రభుత్వానికి అభినందనలు కూడా తెలిపాయి.

ఇంతవరకు బాగానే ఉంది. కులగణన పూర్తయిన తర్వాత వచ్చిన ఆ లెక్కల ఆధారంగా కులాల ప్రాతిపదికన ఈ ప్రభుత్వం రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పించనుందా? 42 శాతం రిజర్వేషన్‌ను ఎలా అమలుచేస్తారు? మొత్తం రిజర్వేషన్ల శాతం 50 శాతానికి మించొద్దని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెల్లడించిన నేపథ్యంలో బీసీలకు 42 శాతం ఎలా సాధ్యమవుతుంది. కులగణన చేసినంత మాత్రాన సరిపోతుందా? తద్వారా రావలసిన ఫలాలు, అందాల్సిన అదనపు ప్రయోజనాలు లేనప్పుడు ఈ లెక్కలు తేల్చే వ్యవహారం వల్ల ఉపయోగం ఏమిటన్నది ఇప్పుడు కొత్తగా ఉద్భవిస్తున్న ప్రశ్న.

నిజానికి దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు రావాల్సినంత గుర్తింపు రాలేదు. వారికి తీరని అన్యాయం జరిగిందనే విషయం రూఢీ అవుతున్నది. ఇంతకు మించి వారికి ఏదో చేయాలనే చాలామంది నాయకులు అనుకుంటున్నారు. కానీ, ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల లెక్కలు తేల్చి ఎవరెంతో.. వారికి అంత అనే మాట అంటున్నది. కానీ, ఇది సాధ్యమేనా?

బీసీల రాజకీయ సాధికారతను కల్పించే విషయంలో ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిపైన చాలా మందికి అనుమానాలుంటాయి. ఇప్పుడు అదే జరుగుతున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఎన్ని అమలయ్యాయి? మిగిలినవి ఎందుకు అమలుకాలేదు? ప్రభుత్వం వద్ద నిధులు లేవా? లేక చిత్తశుద్ధి లేదా? ప్రభుత్వ పనితీరును ఎట్లా అర్థం చేసుకోవాలి? ఇట్లా చాలా విషయాలు జనం చర్చల్లో ఉన్నాయి. కానీ, బీసీ కులగణన విషయానికి వచ్చేసరికి మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగానే బీసీల రాజ్యాధికారం కోసం ఆలోచిస్తుందా? ఆచరిస్తుందా? నిజంగానే బీసీల కోసం పనిచేస్తుందా? ఆ దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తుందా? ఇలాంటి ప్రశ్నలు గత ఏడు దశాబ్దాల కాలంలో సింహభాగం అధికారంలో ఉన్న ఏకైక పార్టీగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని చూసిన ఎంతోమంది మదిలో తలెత్తుతున్నవి.

**దేశవ్యాప్తంగా బీసీల కోసం చిత్తశుద్ధితో పనిచేసే పార్టీలు, నాయకుల కోసం టార్చిలైట్ వేసుకొని వెతకాల్సిన స్థితి ఉన్నది. దానికితోడు బీసీ కులగణన విషయంలో బీహార్ రాష్ట్ర అనుభవం కూడా ఉన్నది. వారు మొత్తం 65 శాతం రిజర్వేషన్లను ఆ రాష్ట్రంలో అమలుచేయగా సుప్రీంకోర్టు దానిపై అభ్యంతరాలు వ్యక్తం చేయటం అందరికీ తెలిసిన విషయమే. 50 శాతానికి మించి ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు ఉండరాదని నొక్కి వక్కాణించి చెప్పడం గమనించదగిన విషయం.**

ఇక్కడ కూడా కులగణన అనంతరం ఎటూ తేల్చకుండా వదిలేస్తారా అనే సందేహాలు తెలంగాణలోని బీసీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం ఎలాగూ ఇవ్వకతప్పని అనివార్య స్థితి. ఇక మిగిలేది 29 శాతం. కులగణన అనంతరం కులాల ప్రాతిపదికన జనాభా శాతాన్ని దృష్టిలో పెట్టుకొని నిజంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే 63 శాతానికి మించి రిజర్వేషన్లు అమలుచేయాల్సి ఉంటుంది. లేదంటే పెద్ద మనసుతో ఈ ప్రభుత్వం జనరల్ సీట్లలో సైతం బీసీలకు కులాల ప్రాతిపదికన సీట్లు ఇచ్చి బరిలో నిలిపి తమ చిత్తశుద్ధిని చాటుకోవాల్సి ఉంటుంది. మొన్న ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ ఎన్ని సీట్లు ఇచ్చిందో అందరికీ తెలుసు. అలాంటిది త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ కేటగిరి సీట్లలో బీసీలకు ఇచ్చేంత పెద్ద మనసు ఈ ప్రభుత్వానికి, ఈ పాలకులకు ఉంటుందా? అనే విషయాన్ని బీసీ సంఘాలు ఆలోచించుకోవాలి. నిజంగా అంత పెద్ద మనసుంటే తెలంగాణలో ఉన్న మొత్తం గ్రామ పంచాయతీలు 12,769 గ్రామాల్లో 42 శాతం అంటే 5,363 గ్రామ పంచాయతీలకు సర్పంచులుగా బీసీ కులాలకు చెందినవారు ఎన్నిక కావడం ఖాయం. అంతేకాదు, వేలాదిమంది వార్డు మెంబర్లు, 540 మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీపీలుగా 226 మంది, 32 జిల్లా పరిషత్ కార్యాలయాల్లో జిల్లా పరిషత్ చైర్మన్లుగా 14 మంది, ఇంకా జడ్పీటీసీలుగా, ఎంపీటీసీలుగా వందలాది మంది ఎన్నికయ్యే అవకాశాలు లేకపోలేదు.

ఈ గణాంకాలు వినడానికి, చూడటానికి బీసీలకు కానీ, బీసీ సంఘాల నాయకులకు కానీ ఎంతో సంతృప్తినిస్తాయనటంలో సందేహం లేదు. కానీ, ఆచరణ సాధ్యమైనప్పుడే ఈ సంతృప్తి మిగులుతుంది. కేవలం కులగణన చేసి రిజర్వేషన్లు అమలుచేయకపోతే విస్తరు వేసి వడ్డన చేయకుండా అవమానపరిచినట్టే భావించి బీసీలు అదే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పే అవకాశాలున్నాయి. లెక్కల్లో తమ శాతం తెలిసి, తమ బలం ఏంటో వారికి అర్థమైన తర్వాత తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోతే తిరుగుబాటు అనేది తప్పకుండా వస్తుంది. అదే జరిగితే, దాదాపు 60 శాతానికి పైగా బీసీ జనాభా కులాలవారీగా లెక్క తేలితే, కనీసం వారికి ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం అమలు చేయకపోతే జరగబోయే పర్యవసానాన్ని సైతం ఈ ప్రభుత్వం ముందే గుర్తిస్తే మంచిదేమో. ఏదేమైనా లెక్కలు తేల్చే పనికి పూనుకున్నందుకు ఒక పక్క అభినందనలు చెప్తూనే, మరోపక్క వారిచ్చిన మాటను పదే పదే గుర్తుచేస్తూ ఇచ్చిన రిజర్వేషన్ హామీని సాధించుకునే దిశగా కలిసికట్టుగా బీసీ సంఘాల నాయకులు ముందడుగు వేస్తే బాగుంటుంది.

**(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)**



# న్యాయ వ్యవస్థను సంస్కరించాలె

**మానవ హక్కుల ఉద్యమకారుడు ప్రొఫెసర్ సాయిబాబా మృతి వ్యక్తిగతంగా బాధాకరమే కాదు, వ్యవస్థను సవాల్ చేసే వ్యక్తులు ఎదుర్కొనే కఠిన వాస్తవిక పరిస్థితులకు అద్దం పట్టే ఘటనగా కూడా నిలుస్తుంది. ఆయన ఏండ్ల తరబడి జైలు జీవితం గడపాల్సి వచ్చింది. మొదట విచారణ ఖైదీగా, ఆ తర్వాత శిక్ష పడిన ఖైదీగా. ఆ సుదీర్ఘ జైలు జీవితం ఆయన ఆరోగ్యాన్ని దారుణంగా దెబ్బతీసింది. ఇటీవల ఆయనను నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసినప్పటికీ, ఆయన శరీరానికి, మనసుకు దీర్ఘకాలిక నిర్బంధం కలిగించిన గాయాలను పూడ్చేందుకు సమయం ఏ మాత్రం సరిపోలేదు.**

**ఈ** ఉదంతం భారతదేశంలో అసమ్మతితో ఎలా వ్యవహరించాలనే విస్తృత స్థాయి అంశాన్ని మరోసారి ముందుకుతెచ్చింది. చట్టవిరుద్ధమైన నిర్బంధాన్ని ఎదుర్కొన్నవారికి ఆర్థిక పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఓ కీలక తీర్పులో వెల్లడించడం గమనార్హం. సదరు పరిహారం కొంత ఉపశమనం కలిగించినప్పటికీ ఏండ్లకొద్దిగా కోల్పోయిన జీవితాన్ని అది తిరిగివ్వలేదనేది వాస్తవం. అనుభవించిన వేదనకు, ఆరోగ్యం, సంక్షేమంపై పడిన ప్రభావానికి అది పరిహారం కాజాలదు. ఆర్థిక పరిహారం కన్నా న్యాయనిర్ణయ విధానంలో, మరీ ముఖ్యంగా బెయిల్ మంజూరు విషయంలో వ్యవస్థాగత మార్పులు తీసుకురావడం చాలా ముఖ్యం.

ఏ ప్రజాస్వామిక న్యాయవ్యవస్థకైనా బెయిల్ అనేది హక్కు, జైలు అనేది మినహాయింపుగా గుర్తించే సూత్రం మూలాధారం కావాలి. దురదృష్టవశాత్తు ఈ సూత్రం, విశేషించి ప్రభుత్వం పట్ల అసమ్మతి, వ్యతిరేకత విషయంలో పదే పదే తిరస్కారానికి గురికావడం మనం చూస్తున్నాం. ఈ సూత్రాన్ని తలదాల్చేందుకు బదులుగా పాలకపక్షాలు, తమ రాజకీయ భావజాలంతో నిమిత్తం లేకుండా, అసమ్మతి తెలిపేవారి గొంతు నొక్కేందుకు లేదా ఆధిపత్యాన్ని ప్రశ్నించేవారిని శిక్షించేందుకే తరచుగా తమ అధికారాన్ని వినియోగించుకుంటున్నాయి. ప్రొఫెసర్ సాయిబాబా కేసు ఇందుకు ఒక దృష్టాంతంగా నిలుస్తుంది. ఆయన నిజానికి ఓ ప్రతిపక్ష నేత కాదు. కేవలం మానవ హక్కులు, న్యాయం గురించిన ప్రశ్నలు లేవనెత్తిన ఓ అసమ్మతివాది మాత్రమే. అందుకు ఆయన భారీ మూల్యమే చెల్లించుకున్నారు.

బెయిల్ అనేది మినహాయింపు కాకుండా తప్పనిసరి నిబంధనగా అమలయ్యేలా చూసే బాధ్యత న్యాయ వ్యవస్థపై ఉన్నది. నేర నిరూపణ లేకుండా సుదీర్ఘకాలం జైలులో పెట్టడం లేదా విచారణ ఖైదీగా కొనసాగించడం వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించడమే కాదు, న్యాయవ్యవస్థ ఔచిత్యంపై ప్రశ్నల నీడలు పరుస్తుంది. న్యాయవ్యవస్థ విచారణ విధానం ప్రజల హక్కులు కాపాడేలా ఉండాలి, వారి గొంతు నొక్కేలా కాదు. దురదృష్టవశాత్తు ప్రొపెసర్ సాయిబాబా లాంటివారు ఎందరో హింసాత్మక ఘటనలకు పాల్పడినందుకు కాదు, కేవలం ప్రభుత్వ వైఖరిని సవాల్ చేసే అభిప్రాయాలు కలిగి ఉన్నందుకు, వాటిని వ్యక్తపరిచినందుకు జైలులో మగ్గిపోవాల్సి వస్తున్నది.

**అసమ్మతి అనేది ఒక ప్రజాస్వామిక హక్కుగా కాపాడే న్యాయవ్యవస్థను నిలబెట్టేందుకు మనమంతా సిద్ధంగా ఉన్నామా అనేది అసలు ప్రశ్న. తప్పుడు నిర్బంధానికి ఆర్థిక పరిహారం అనేది ముఖ్యమైనదే అయినప్పటికీ విశ్వాసాల కారణంగా ఏ వ్యక్తినీ అక్రమ నిర్బంధానికి గురిచేయకుండా బెయిల్ హక్కును న్యాయ వ్యవస్థ అమలు చేయడం అంతే ముఖ్యం లేదా అంత కంటే ముఖ్యం. అసమ్మతి అనేది ప్రజాస్వామ్యంలో కీలక అంశమని, దానిని అణచివేయడం కాకుండా కాపాడటమనేది న్యాయవ్యవస్థ బాధ్యత కావాలని ప్రొఫెసర్ సాయిబాబా జీవితం, పోరాటం మనకు గుర్తుచేస్తున్నాయి.**

ఈ దిశగా ఆలోచిస్తే, ప్రొఫెసర్ సాయిబాబా మరణం న్యాయ వ్యవస్థ, శాసనకర్తలు సత్వరమే ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచిస్తున్నది. న్యాయం అనేది, ముఖ్యంగా అసమ్మతి హక్కును కాపాడే విషయంలో.. సజావుగా, సత్వరమే అందించడం ప్రజాస్వామిక విలువలను నిలబెట్టే విషయంలో అత్యంత కీలకం కావాలి. హేతుబద్ధమైన, విమర్శనాత్మకమైన గొంతులను సుదీర్ఘ నిర్బంధంతో నొక్కేయడాన్ని మనం అనుమతించరాదు. అందుకు భిన్నంగా బెయిల్ అనేది హక్కు, జైలు అనేది మినహాయింపు అనే సూత్రాన్ని అమలయ్యేలా చూసి, వారి అసమ్మతి హక్కును కాపాడేలా వ్యవస్థను పటిష్ఠం చేయడం ఎంతైనా అవసరం. రాజస్థాన్ వర్సెస్ బాలచంద్ కేసులో జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్ 'బెయిల్ అనేది అనివార్య నిబంధన. జైలుకు పంపడమనేది మినహాయింపు' అని ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా గుర్తుచేసుకుందాం.



**బోయినపల్లి వినోద్‌కుమార్**
**(వ్యాసకర్త: న్యాయవాది, మాజీ పార్లమెంట్ సభ్యులు)**

# మినీ సమరం.. ఎవరికి సంబురం?

**సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఆరు నెలలైనా గడవక ముందే దేశంలో 'మినీ జనరల్ ఎలక్షన్స్'కు నగారా మోగింది. రెండు రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలతో పాటు రెండు లోక్‌సభ స్థానాలు, 48 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు ప్రకటిస్తూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అందరి దృష్టి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపైనే ఉన్నప్పటికీ, మిగతా ఎన్నికలేమీ తక్కువయి కావు. రాశి కన్నా వాసి మిన్న అన్నట్టు సమయ, స్వభావరీత్యా ఆయా రాష్ట్రాల్లోని ఉప ఎన్నికలూ కీలకమైనవే! కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజీనామాతో ఖాళీ అయిన వయనాడ్ (కేరళ) లోక్‌సభ స్థానంలో ఆయన సోదరి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ పోటీ చేస్తున్నారు. 15 రాష్ట్రాల్లో జరుగుతున్న ఉప ఎన్నికలు, వాటి ఫలితాలతో ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలేం మారవు. కానీ, ఒక సంకేతం! సంకీర్ణ ప్రభుత్వాల శకంలో కూటముల బలాబలాల గణింపుకొక సందర్భం. మారుతున్న రాజకీయ పరిణామాలు, ద్విధ్రువ రాజకీయాల్లో జరిగే పునరేకీకరణలకు ఇదొక నమూనా! అంతస్సమీక్షకు ఓ అవకాశం!**



**దిలీప్ రెడ్డి**



**కూ**టములుగా తప్ప సొంతంగా ఏ పార్టీ మెజారిటీ సాధించి, ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితులు లేని మహారాష్ట్ర ఎన్నికలకు సిద్ధమైంది. వచ్చే నెల 20న పోలింగ్, 23న ఓట్ల లెక్కింపు-ఫలితాల వెల్లడి అని భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. దాంతో పాటు జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీకి, వయనాడ్ (కేరళ), నాందేడ్ (మహారాష్ట్ర) లోక్‌సభ స్థానాలకు, మరో 48 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధానంగా.. ఉత్తరప్రదేశ్ (9), రాజస్థాన్ (7), పశ్చిమబెంగాల్ (6), అసోం (5), పంజాబ్ (4), బీహార్ (4), కర్ణాటక (3) తదితర రాష్ట్రాల్లో ఈ నియోజకవర్గాలున్నాయి. ఒక్కోచోట ఒక్కో రాజకీయ పరిస్థితి నెలకొని ఉన్నది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పాలక ఎన్డీయే, విపక్ష ఇండియా కూటముల మధ్య అంతరం తగ్గి, పోటీ బలపడుతున్న క్రమంలో ఈ ఉప ఎన్నికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు పలు చోట్ల ముఖాముఖి తలపడనుండగా, వేర్వేరు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతీయ పార్టీలు కూడా రెండు ముఖ్య కూటముల్లో భాగమై కొన్ని చోట్ల, ఏ కూటమికీ చెందక బయటినుంచి విడిగా పోటీ చేస్తున్నాయి.

**కార్యక్షేత్రం యూపీ:** భారత జాతీయ రాజకీయాలకు ఉత్తరప్రదేశ్‌ను దిక్సూచిగా పరిగణిస్తారు. ఇక్కడి రాజకీయ పరిణామాలు రాబోయే జాతీయ సమీకరణాలకు సంకేతంగా ఉంటాయన్నది పలుమార్లు రుజువైన సత్యం. యూపీలో 9 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. నిన్నటి సార్వత్రిక ఎన్నికల్లో 400 స్థానాలు సాధించాలన్న 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అన్న బీజేపీ నినాదాన్ని గట్టిగా గండికొట్టిన రాష్ట్రమిది. సమాజ్ వాది పార్టీ (ఎస్పీ) నేత, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ నేతృత్వంలో ఇండియా కూటమి' మంచి ఫలితాలు సాధించింది. పదేండ్లుగా ఇక్కడ సర్కారు నడుపుతున్న బీజేపీలో సంస్థాగతమైన అంతర్గత సమస్యలున్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య నడుమ ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తున్నది. ఉప ముఖ్యమంత్రి బహిరంగంగానే ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఆయనకు ప్రధాని మోదీ-హోం మంత్రి అమిత్ షా జోడీల వెన్నుదన్నులు ఉన్నాయనే ప్రచారం పార్టీ వర్గాల్లోనూ ఉన్నది. బీజేపీ సిద్ధాంత మాతృక అయిన ఆర్‌ఎస్‌ఎస్ అండదండలు సీఎం యోగికి పుష్కలంగా ఉన్నాయని, అదే సీఎం-డీసీఎంల మధ్య స్పర్థకు కారణమనే వ్యాఖ్యానాలు మీడియాలో తరచూ వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉప ఎన్నికలను ఎలా నెట్టుకువస్తారన్నది పెద్ద ప్రశ్నే! ఇక, ఇండియా కూటమిలోనూ అభిప్రాయ భేదాలున్నాయి. వాస్తవికమైన ప్రజాబలం లేకున్నా ఎక్కువ సీట్లకు బెట్టు చేసి, కూటమి ఉమ్మడి ప్రయోజనాలను కాంగ్రెస్ దెబ్బతీస్తున్నదనే బలమైన భావనతో అఖిలేశ్ ఉన్నారు. అందుకేనేమో, సంప్రదింపులు ఏమీ లేకుండానే 6 అసెంబ్లీ స్థానాల్లో ఎస్పీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ఆయన ఏకపక్షంగా ప్రకటించేశారు.

**పరీక్షాస్థలి పంజాబ్:** ఇటీవల చతికిలపడ్డ 'ఆప్' తిరిగి పుంజుకోవడానికి పంజాబ్ ఉప ఎన్నికలు అరవింద్ కేజ్రీవాల్‌కు ఒక అవకాశం. ఆయన అరెస్టయి, బెయిల్‌పై బయటికి వచ్చిన లిక్కర్ కేసు అవినీతి ఆరోపణలు 'పంజాబ్' ఎన్నికలకు సంబంధించినవే కనుక తన నిర్దోషిత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిరూపించుకోవాల్సిన సవాల్! ఇక్కడ 4 స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. పొరుగు రాష్ట్రం హర్యానా ఎన్నికల్లో దాదాపు అన్ని స్థానాలకు పోటీ చేసి, కనీసం ఒక్క స్థానం కూడా దక్కించుకోని 'ఆప్' దుస్థితిని ఇక్కడ తిరగరాయాలి. 2 శాతం ఓటు వాటా దక్కించుకున్నా ఒక్క సీటూ గెలువలేకపోవడానికి కారణం, కేజ్రీవాల్ బెయిల్‌పై బయటకు రావడంలో జరిగిన జాప్యమని పార్టీ వర్గాలు సమర్థించుకున్నాయి. ఇప్పుడు పూర్తి సమయం ఆయన అందుబాటులో ఉండటం వారికి కలిసి వచ్చే అంశమే! ఇండియా కూటమి పొత్తులు ఇక్కడ ఎలా ఉంటాయి? ప్రత్యర్థి కూటమి ఎన్డీయేలో, తిరిగి జతకట్టిన బీజేపీ-అకాలీదళ్ సఖ్యత ఎంత ఫలించేనో? వేచి చూడాల్సిందే!

**రాజస్థాన్ రాస్తా మారేనా?: ప్రతి తడవా ప్రభుత్వాలు మారే రాజస్థాన్ ఉప ఎన్నికల్లో ఎవరికి ఆధిక్యత లభిస్తుందనే ఉత్కంఠ రాజకీయవర్గాల్లో ఉన్నది. 10 నెలల కింద, అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలిచి చరిత్ర తిరగరాస్తామన్న కాంగ్రెస్ పప్పులేమీ ఉడకలేదు. మాజీ సీఎం అశోక్ గెహ్లాట్, యువ నాయకుడు సచిన్ పైలెట్ వర్గాల మధ్య సయోధ్య, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా కుదరలేదు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 14, కాంగ్రెస్ 8 స్థానాలు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ నుంచి బీజేపీ అధికారం కైవసం చేసుకున్నా.. వారిలో అంతర్గత వైషమ్యాలున్నాయి. బీజేపీ-కాంగ్రెస్ ముఖాముఖి తలపడే రాజస్థాన్‌లో 7 స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఎవరిదో ఆధిపత్యం?**

**మమత ప్రభ తగ్గిందా, పెరిగిందా?:** రావణ కాష్టంలా నిత్యం రగిలే రాష్ట్రం పశ్చిమబెంగాల్‌లో 6 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. గవర్నర్-ప్రభుత్వం మధ్య సమన్వయ లోపం నిరంతర వివాదాలకు కారణమవుతున్నది. పనికిమాలిన పంతాలకు వెళ్లి కిందటిసారి అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), బీజేపీ నువ్వా-నేనా అన్నట్టు పోటీని రసవత్తరం చేశాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభ తగ్గుతున్నదనే ప్రచారం బెంగాల్ బయట ఎక్కువగా వినిపిస్తున్నది. ఆమెను ఇబ్బంది పెట్టే అన్ని మార్గాలూ వెతుకుతుందనే ముద్ర పడిన బీజేపీ, సంస్థాగతంగానే కాకుండా ప్రజాదరణ పరంగా కూడా పుంజుకున్న ఛాయలు లేవు. కమ్యూనిస్టులు ఒకవైపు బలపడే యత్నాల్లో ఉన్న బెంగాల్లో 'ఇండియా కూటమి' భాగస్వామ్య పక్షాలైన టీఎంసీ-కాంగ్రెస్ ఏ మేరకు సయోధ్యకు వస్తాయి? కమ్యూనిస్టులతో ఎలా వ్యవహరిస్తారు? అన్నది కీలకం. ఉప ఎన్నికలను, తమ రాజకీయ ప్రయోగాలకు వాడే ప్రయత్నం చేస్తారా వేచి చూడాల్సిందే!

**సిద్దుకు పెరిగిన కష్టాలు:** ఏడాది కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీది '40 శాతం కమిషన్ ప్రభుత్వమ'నే ప్రచారంతో కర్ణాటక కాంగ్రెస్ పైచేయి సాధించి, గెలిచి సర్కార్‌ను ఏర్పర్చింది. ఎక్కువ ప్రజాదరణతో ముఖ్యమంత్రి అయిన సిద్ధరామయ్య ఇప్పుడు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కడకు గవర్నర్ అనుమతించారు, లోకాయుక్త విచారణ చేపట్టింది. పార్టీ అధినాయకత్వం సీఎంను మారుస్తుందనే ప్రచారం ఊపందుకోవడంతో.. 'కర్ణాటకలో రెండో కృష్ణుడు ఎవరు?' అనే ప్రశ్న సహజంగానే పుట్టింది. 'కర్ణాటక మళ్లీ మాదే' అంటున్నది బీజేపీ. ఈ పరిస్థితుల్లో ఇక్కడ 3 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. అందులో ఒకటి, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రి అయిన, జనతాదళ్ సెక్యులర్-జేడీ(ఎస్) నేత కుమారస్వామి ఖాళీ చేసిన అసెంబ్లీ స్థానం. మరి, కన్నడిగుల మనసేమిటో?

ఇవే కాకుండా బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో రెండేసి చోట్ల, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, మేఘాలయ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఒక్కో నియోజకవర్గంలో ఉప ఎన్నికలున్నాయి. ఈ ఎన్నికలు కొందరికి సవాల్ అయితే, మరికొందరికి అవకాశం. ముఖ్యంగా ఎన్డీయే, ఇండియా కూటములకు నేతృత్వం వహిస్తున్నవారు సయోధ్యతో సత్ఫలితాల సాధనకు, సరైన సంకేతాలు పంపుకోవడానికి ఇది సముచిత సందర్భం! జమ్ము-కశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారానికి ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ హాజరయ్యారు. ఇద్దరూ ఇండియా కూటమి వారే! వారికి ఉమ్మడి రాజకీయ కార్యక్షేత్రం లేదు. ఇటువంటి సయోధ్య వేడుకలు-సంబరాలకేనా? కూటమి పక్షాల మధ్య సరైన పొత్తులు, ప్రజామోదం పొందడంలోనూ ఉంటుందా? ప్రశ్నించుకునే సమయం. పరీక్షించుకునే అవకాశం ఇది!

**(వ్యాసకర్త: పొలిటికల్ ఎనలిస్ట్, డైరెక్టర్ పీపుల్స్ పల్స్, సర్వే రీసెర్చ్ సంస్థ)**